క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

సత్యవేడు: మండల పరిధిలోని రాజగోపాలపురం గ్రామానికి చెందిన వేలాయుధంకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ. 3.20 లక్షల చెక్కును శుక్రవారం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి అందజేశారు. వేలాయుధం భార్య విజయ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె చికిత్సకు అయిన ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యింది. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి కలసి ఆయన చెక్కును అందజేశారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, సెక్రటరీ రజిత పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సదాభార్గవి

రేణిగుంట: రేణిగుంట బాలుర ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌ను శుక్రవారం ఏపీ గిరిజన గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి సదాభార్గవి శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత ఆశయాలను నిర్ణయించుకుని, వాటి సాధనకు శ్రమించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఐఎఫ్‌పీలను, ట్యాబ్‌లను వినియోగించుకుని మరింతగా రాణించాలని, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జాకీర్ సేవలు శ్లాఘనీయం



చెక్కును అందజేస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి: మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో పంప్ ఆపరేటర్‌గా జాకీర్ సేవలు అభినందనీయమని కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం జాకీర్ ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం ఆయనను మున్సిపల్ సిబ్బంది ఘనంగా సత్కరించింది. కమిషనర్ మాట్లాడుతూ 34 సంవత్సరాల సుదీర్ఘ కాలం అంకితభావంతో ఆయన సేవలు అందించారని కొనియాడారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ చెక్కును అందజేశారు.

వేకువ నుంచే పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఒకటో తేదీ శుక్రవారమే వృద్ధులు, వికలాంగులు, వితంతువుల వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. వేకువజాము 5 గంటలకే ఇంటింటికీ వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. ఆలత్తూరు. కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, పల్లమాల, జీఎస్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్ ఆధ్వర్యంలో సాయంత్రంలోపు 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వడంపై పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేశారు.

100 రోజులు పని కల్పించాలి

రేణిగుంట: ప్రతి జాబ్‌కార్డుదారునికి 100 రోజుల పని కల్పించాలని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గురవరాజుపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, పని వివరాలను సకాలంలో అప్‌డేట్ చేసి కూలీలకు సక్రమంగా వేతనాలు పడేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మండల ఏపీవో జ్యోతిశ్రీ పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగలో 39 పల్స్ పోలియో కేంద్రాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఈనెల 3వ తేదీ 39 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల వైద్యాధికారి దివాకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 3,608 మంది పిల్లలున్నారని, 3 రూట్లలో 30 కేంద్రాలలో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐదేళ్ల లోపు పిల్లలందరికీ..

నారాయణవనం: మండలంలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఆదివారం పోలియో చుక్కలను వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులను జాగృత పరిచేందుకు వైద్య సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 4,039 మంది ఉండగా, 27 కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. వైద్యాధికారి రాగసుధ, సీహెచ్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాళహస్తి: స్వర్ణముఖి నది రెండు బ్రిడ్జిల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం సాయంత్రం లభ్యమైనట్టు ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడి ఒంటిపై లైట్ బ్లాక్ కలర్ ఎర్రగీరల షర్ట్, బ్లూ జీన్స్ ధరించి ఉన్నట్టు వెల్లడించారు. అతని వద్ద ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వెల్లడించారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం





ఎండీపుత్తూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యేకు భారీ గజమాలతో ఆత్మీయ స్వాగతం

- ప్రతి గడపలో నవరత్నాల ఆనందం
- ప్రజలే వైఎస్సార్ సీపీ ప్రచార సారథులు
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మహిళల అభ్యున్నతికి, పేద ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషిచేసి ప్రతి గడపలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆనందాలు నింపారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఎండీ పుత్తూరులో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. పార్టీ నాయకులు క్రేన్ ద్వారా ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి, పూలవర్షం కురిపించారు. అనంతరం ఎమ్మెల్యే పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 570 కుటుంబాలను కలిశారు. ఎండీపుత్తూరు, అరుందతీవాడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. 57 నెలల్లో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిపై ప్రజలను




బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. కరోనా వేళ కానరాని బొజ్జల కుటుంబం 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజల వద్దకు వస్తోందని, వారి భూటకపు మాటలు నమ్మొదని హితవు పలికారు.

భారీ బైక్ ర్యాలీ

మండలంలోని ముసలిపేడు నుంచి ఎండీపుత్తూరు వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. 350 బైక్‌లు, 28 కార్లతో ఎండీపుత్తూరుకు చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు మోహన ప్రియ, గురవమ్మ, రాజేశ్వరి, నారాయణ, పెంచలయ్య, ఎంపీటీసీ పద్మమ్మ, వైస్ ఎంపీపీలు జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు రామయ్యఆచారి, మహేష్, కందాటి ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ముసలిపేడు మునిరాజా, మురగయ్య, రామచంద్రయ్య, గురునాథం, రాజులపాలెం సుబ్రమణ్యం, వెంకటేష్ యాదవ్, యల్లయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, కుప్పాల వెంకటేష్, కేశవులురెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

రా రమ్మంటున్న శ్రీకాళహస్తి



శ్రీ-కాళ-హస్తి ప్రతిమలున్న విద్యుత్ దీపాలు



ఆలయంలో తీర్చిదిద్దిన రంగవల్లులు



శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం ముస్తాబవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు అత్యంత వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పనులను యుద్ధప్రతిపాదికన చేస్తున్నారు. నాలుగు మాడవీధుల్లో శివలింగం, నంది, శ్రీ(సాలెపురుగు)-కాళ(పాము), హస్తి(ఏనుగు) రూపాలున్న విద్యుద్దీపాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. కైలాసం సెట్టింగ్ మరింత అందంగా తీర్చిదిద్దుకోనుంది. ఆలయంలో రంగవల్లులు భక్తులను కట్టిపడేస్తున్నాయి. స్వామి అమ్మవార్ల ఊరేగింపునకు వాహనాలకు రంగులు అద్ది సిద్ధం చేశారు. ఈఏడాది ఎన్నడూ లేని విధంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న దాత గురుప్రసాద్

మాట్లాడుతూ ప్రత్యేక క్యూలు, వాహనాల పార్కింగ్, స్నానఘట్టాలు, విద్యుద్దీపాలంకరణ పనులు ముమ్మరం చేశామన్నారు.

ముక్కంటి ఆలయానికి పట్టుచీరల వితరణ

శ్రీకాళహస్తీశ్వరాలయానికి మదనపల్లెకు చెందిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నిర్వాహకుడు రాచకొండ గురుప్రసాద్ 9 పట్టువస్త్రాలను సమర్పించారు. శుక్రవారం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి ఆయన వీటిని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులకు అందించారు. ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగలాపురం: మండలంలోని సురుటపల్లి శ్రీమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ హోమపూజల అనంతరం ధ్వజ చిత్రపటాన్ని ఆరోహింపజేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహాదీపారాధన, ఐదు గంటలకు యాగశాల పూజ, సాయంత్రం మూలవర్లను అభిషేకించిన అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ముందు కోలాట ప్రదర్శనలు సాగుతుండగా వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ వాహన సేవ కనువిందుగా



సాగింది. అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు సమర్పించారు. స్వామి, అమ్మవారి సేవలో పాల్గొని భక్తులు తరించారు. పల్లకీ సేవకు ఉభయదారులుగా మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు ఉభయదారుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి, బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.

రూ.27 లక్షలతో నూతన తెప్పలు





తెప్పలను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు, పట్టువస్త్రాలను తీసుకెళుతున్న ఈఓ నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈసారి బ్రహ్మోత్సవాలకు రూ.27 లక్షలతో నూతన తెప్పలను తయారు చేయించింది. శుక్రవారం దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వాటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో ఇప్పటి వరకు టీటీడీ నుంచి తెప్పలను తెచ్చుకునే వారమని తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో పాలకమండలి సమావేశంలో ర రూ.27లక్షలతో తెప్పలను తయారు చేయాలని తీర్మానించి, తయారు చేయించినట్లు పేర్కొన్నారు. ఆలయ ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మల్లికార్జునునికి ముక్కంటి పట్టువస్త్రాలు

శ్రీకాళహస్తి: శ్రీశైలంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయానికి శుక్రవారం ఈవో నాగేశ్వరారావు చేరుకోగా.. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు.

పంట నమోదుపై గ్రామ సభలు

నారాయణవనం: మండలంలో రబీలో పంట నమోదు ముసాయిదా జాబితాపై గ్రామ సభలను నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శోభారాణి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రబీలో మండలంలో ఈ క్రాప్ చేసుకున్న రైతుల క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని అన్నారు. జాబితాపై సోమవారం వరకు ఆర్బీకేల్లో గ్రామ సభలను నిర్వహిస్తామని తెలిపారు. రైతులు తమ వివరాలను ముసాయిదా జాబితాలో సరిచూసుకుని, అభ్యంతరాలను ఈనెల 5వ తేదీ లోపు రాత పూర్వకంగా ఆర్బీకేల్లో అందజేయాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 7వ తేదీ తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. తుది జాబితా ప్రకటించిన అనంతరం మార్పులు, చేర్పులు చేసేందుకు వీలు ఉండదని తెలిపారు. తుది జాబితా ప్రదర్శన అనంతరం సమాచారాన్ని రైతుల సెల్ నంబర్లకు పంపుతామని, పంట నమోదు పత్రాన్ని ప్రింట్ తీసి రైతులకు అందిస్తామని శోభారాణి పేర్కొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యం





ఏర్పేడు: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, నారాణవనం : సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

నారాయణవనం: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తోందని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనం-2 సచివాలయ పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 550 మందికి పైగా రోగులు వైద్య పరీక్షలను చేయించుకున్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు ఉమాపతి(జనరల్ మెడిసన్), కీర్తి సాగరి(గైనిక్), వైద్యాధికారులు దర్శిత్‌రాజ్, రాగసుధ వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచ్ శారదాగణేషన్, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ఎంపీటీసీ సభ్యులు రాధామోహన్, పార్వతి, స్థానిక ప్రజాప్రతినిధులు గురుస్వామి, బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.



నాగలాపురం : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఇంటి ముంగిటికే వైద్యం

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఇంటిముంగిటకే వైద్యం అందుతోందని ఏర్పేడు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆమందూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ఆమందూరు, బాలకృష్ణాపురం, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 292 మందికి బీపీ, షుగర్, గళ్ల, రక్త, తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ జమళ్ల శ్రీనివాసులు, వైద్యాధికారి సురేషబాబు, ఎంపీడీఓ గిడ్డయ్య, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మురగయ్య, ఏర్పేడు పీహెచ్‌సీ సీహెచ్ఓ శివరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

నాగలాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరమని వేంబాక్కం సర్పంచ్ తెన్నరసు అన్నారు. మండలంలోని వేంబాక్కం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో నాగలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్ కిషోర్ పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన 383 మందికి బీపీ, షుగర్ వంటి ఇతర సమస్యలతో బాధ పడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



సత్యవేడు: ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ, సమన్వయకర్త, మహిళలు

సత్యవేడు: మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగనన్నకు మహిళలంతా అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్ గురుమూర్తి, సత్యవేడు నియోజవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట తూచా తప్పకుండా నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన గొప్ప మనసున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబనే లక్ష్యంగా సీఎం పలు సంస్కరణలు చేపట్టారన్నారు.సంక్షేమ ఫలాలు నిష్పక్షపాతంగా, అర్హులందరికీ అందాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. సత్యవేడు, కేవీబీపురం, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం మండలాల్లోని 5,610 సంఘాల్లో ఉన్న 54,710 మంది మహిళలకు నాలుగు విడతల్లో 205.71 కోట్లు అందజేసినట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

అక్కా చెల్లెమ్మలతో కలసి ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త నూకతోటి రాజేష్ సమావేశానికి ముందు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఏపీఎం సర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, కోఆప్షన్ మెంబరు మస్తానీ, వైఎస్సార్ సీపీ తాడిపత్రి నియోజవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేద్దాం

సత్యవేడు: సీఎంగా రెండో పర్యాయం జగనన్నే వచ్చేలా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పని చేద్దామని పార్టీ శ్రేణులకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, సత్యవేడు నియోజవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని భేరిశెట్టి కల్యాణ మండపంలో పార్టీ మండల కన్వీనర్ కె. సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ సత్యవేడు నియోజక వర్గ పార్టీ అభ్యర్థి విజయమే ధ్యేయంగా సమష్టిగా పని చేయాలని కోరారు. పార్టీ తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ. నిరంజన్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, మాజీ చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, మండల యువత అధ్యక్షుడు వంశీకృష్ణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.6.39 కోట్ల మెగా చెక్కు ఆవిష్కరణ

కేవీబీపురం: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా నాలుగవ విడత పంపిణీ కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజక వర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మండ లంలోని 2000 సహాయక సంఘాల్లోని 8,016 మంది డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు మంజూరైన 6.39 కోట్ల వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఎంపీ, సమన్వయ కర్త రాజేష్ ఆవిష్కరించారు. మహిళలు సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పలు సమస్యలు పరిష్కారం

ఎంపీ గురుమూర్తి గత మండల పర్యటనలో తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను పరిష్కరించేందుకు సుమారు రూ.35 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధుల ద్వారా నిర్మించిన సదాశివపురం, అంజూరు బస్టాప్‌లను ఎంపీ ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.3 లక్షలతో మరమ్మతులు చేసిన ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను



రాజేష్‌ను పరిచయం చేస్తున్న ఎంపీ గురుమూర్తి

గురుమూర్తి ప్రారంభించారు.

పార్టీశ్రేణులతో సమావేశం

ఎంపీ గురుమూర్తి, నియోజక వర్గ సమన్వయ కర్త రాజేష్ శుక్రవారం పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య అధ్యతన పార్టీ శ్రేణులతో ఆత్మీ సమావేశమయ్యారు. రాజేష్‌ను ఎంపీ పరిచయం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ధనుంజయ రెడ్డి, నాయకులు నందకుమార్, లాల్ బాబు యాదవ్, మాధవి రెడ్డి, గురునాథం, దశరథరామి రెడ్డి, డేవిడ్, హరి బాబు, అరుణ్, మూర్తి సుబ్బన్న, అయ్యప్పరెడ్డి, సర్పంచ్‌లు గిరి పాల్గొన్నారు.

8,587 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో 3,218 మంది రైతులకు సంబంధించి 8,587 ఎకరాల భూమిలో పంటల ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి అయినట్లు మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, కనమనంబేడు పంట పొలాల వద్ద ఈ–క్రాప్ బుకింగ్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటనే వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలకు అర్హులు అవుతారని తెలిపారు.

ఆస్తి, ఖాళీ జాగా పన్నుపై వడ్డీ మాఫీ

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి, ఖాళీ జాగాల పన్నుపై వడ్డీ మాఫీ చేసినట్లు కమిషనర్ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం ఏకమొత్తంలో చెల్లించినవారికి ఈ వడ్డీ మాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు. పన్నుల చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సచివాలయంలో, ఆన్‌లైన్ పద్ధతిలో కూడా చెల్లించవచ్చన్నారు. ఈనెల 31వ తేదీ లోపు చెల్లించాలన్నారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

శ్రీకాళహస్తి: వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఏఈ మాట్లాడుతూ సర్పంచులు ముందస్తుగా సమాచారం ఇస్తే తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ జనుములు, జీలగలు, పిల్లిపెసర 50శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 459 మంది రైతులకు ఈక్రాప్ పంట నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సుజాత మాట్లాడుతూ ఉపాధి హామీ కింద మామిడి, సపోట, నిమ్మ, దానిమ్మ, మునగ, డ్రాగన్, రోజా, మల్లి తోటలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వెలుగు ఏపీఎం మాట్లాడుతూ మహిళా సభ్యుల పొదుపు లక్ష్యం రూ.15కోట్లు కాగా ఈ ఏడాది 31 కోట్లు సాధించినట్లు తెలిపారు. మహిళా రుణాలు లక్ష్యం రూ.5 కోట్లు కాగా రూ.6 కోట్లు అందించినట్లు చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ పనులు

పెద్దకన్నలి పంచాయతీలో రెండు రోజుల కిందట చేతిపంపు మరమ్మతులకు గురికాగా పంచాయతీ తీర్మానం మేరకు బాగు చేసేందుకు తాము ప్రయతించినట్లు పంచాయతీ కార్యదర్శి నవీన్ తెలిపారు. అయితే ఎటువంటి పంచాయతీ తీర్మానం లేకుండా నిమిషానికి 30 లీటర్ల కంటే తక్కువ నీటి సామర్థ్యం కలిగిన బోరుకు చేతిపంపు మాత్రమే అమర్చాలనే నిబంధన ఉన్నా టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో తమ నాయకుల జ్ఞాపకార్థం సొంత నిధులను విరాళంగా అందించి మోటారును అమర్చినట్లు ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆపనులకు సంబంధించి వారు బిల్లులు అందించాలంటూ ఆ నాయకులు తమపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుల విధానాలపై పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మలమ్మ, వైస్‌ఎంపీపీలు మల్లికమ్మ, గెరటారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మణినాయుడు, కోఆప్షన్ సభ్యులు ప్రేమ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, ఎంపీడీవో ప్రవీణ్, ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్యదర్శి నవీన్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మీడియెట్ పరీక్షలు పటిష్ట బందోబస్తు నడుమ శుక్రవారం ప్రారంభమయ్యాయి. అర్ధగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోని అనుమతించారు. నాగలాపురం జూనియర్ కళాశాలను సమస్యాత్మక పరీక్ష కేంద్రంగా ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎటువంటి జిరాక్స్ షాపులు ఉండకూడదని, గుంపులు గుంపులుగా ఉండకూడదని ఎస్సై ఓబయ్య ఆదేశించారు.



పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు